ఎండ

ఘండికోట బ్రహ్మాజీరావు

ఎండ!

ఎండ పేరు తలచుకుంటేనే గుండెలలో దడ పుడుతున్నది.

గడచిన దినం నీడలో నూటపన్నెండు డిగ్రీలు. రాత్రి వడగాడ్పులు కూడా వీచాయి.

దయానిధి ఎండ గురించి ఆలోచించడంలేదు.

"బాబూ! రిక్షా! మాస్టరు బాబూ! రిక్షా!"

సైకిలువాడు గంట వాయిస్తూ వెంట పడుతున్నాడు.

కొత్తగా రోడ్డు వేస్తున్నారు- కాదు కాదు- పాత రోడ్డే... బాగు చేస్తున్నారు. మెట్లలాంగి రాళ్ళు మేకులవలె గుచ్చుకుంటున్నాయి. బొటన వ్రేలికి మొన తేరిన రాయొకటి తగిలి నెత్తురు కారుతున్నది.

దయానిధి ఆ విధంగా కొన్ని దూరం నడిచి

ఆగిపోయాడు కట్టుకున్న పంచ అంచు చింపి ఎడమకాలి బొటన వేలికి కట్టుకున్నాడు

ఎనిమిదిన్నరకే ఎండ చురచుర లాడింది

పాము బుసలకు మళ్ళేగాలి చెంపలకు తాకుతున్నది

దయానిధి తిరిగి నడవడం మొదలు పెట్టాడు

సుమతీ! ఉప్మా చెయ్యడం తెలుసా? నేను చెప్తున్నాను విను పోపులో కొంచెం హెచ్చుగా సెనగపప్పు– కొద్దిగా ఆవాలు ఇంకా ఇంకా వాడి శ్రాద్ధం! వాడికి స్పెషల్ ఉప్మా కావాలట!

ఆడదానికి ఉప్మా చెయ్యడం రాదూ? అదేమైనా కొత్త రకం పిండివంటా? సుమతి కొత్త కోడలయితే మాత్రం ఉప్మా చేయడమే తెలీదా?

ఆమె ఆగర్భ శ్రీమంతురాలుకాదు మామూలు గుమాస్తా కూతురు

వెనకనుంచి కారు హారను ఒకటే మోత అప్పటికి అతనికి తెలిసింది రోడ్డు దాటిబ్రిడ్జి వేపు వెళ్తున్నట్టు

స్టేషను బ్రిడ్జిమీద ఎడతెగని జనం– ఎవరి బాధ వారిది– ఎండ నుండి తప్పించుకోడానికి గొడుగులు తలల మీద తడి గుడ్డలు

తడి గుడ్డలతో కొంత మంది గొంతుకలు కోస్తారు ఎలా కోస్తారో తనకు తెలియదు

నిన్నను నడవలో ఉదయం ఇదే వేళకు– వాడు బాగా ఆలస్యంగా లేచాడు ఉదయం అయిదు గంటలకే వెలుగువస్తే ఆ మహానుభావుడు ఎనిమిది గంటలకు లేచాడు అదింకా వాడికి చాల ఎర్లీ అట! హోటలులో ఎనిమిదిన్నరకు లేచి సరిగా తొమ్మిది కొట్టేసరికి పనిమీద బయలుదేరుతాడట! ఉన్నది ఒకటే పడకగది నాలుగడుగులు వెడల్పున్న నడవ– నడవ దాటి వెళ్తే వంటిల్లు, తరువాత పెరడు ఏం చేయడం?... ఇటువంటి ఇంట్లో ఉంటూ ఆరు నెలలయింది.... లేచిన వాడికి ఆమె ఎదురవుతుంది కాబోలు.

"ఓహో మీరేనా! గుడ్ మార్నింగ్"

"నేను తెలుగు పిల్లను– నాకు గుడ్‌మార్నింగ్ లెందుకు? నేను మీకన్న చిన్నదానిని. మీ స్నేహితుని భార్యని. మామూలుగా సుమతి అంటే చాలు."

"ఇటువంటి పేరంటే నాకు ఎలర్జీ! పాత చింతకాయ పచ్చడి వంటి పేరు. ఏ సినిమా తారపేరో. ఏ రచయిత్రి సృష్టించిన హీరోయిన్ పేరో. పల్లవో. పావనో.. ఎన్నో పేరులుంటే ఇటువంటి పేరు ఎవరు పెట్టారు?"

"తల్లి దండ్రులు పెట్టిన పెద్దవాళ్ళ పేరిది."

"అదా సంగతి! ఏ బామ్మదో నన్నమాట. నేను చాల కరెక్టుగా చెప్పాను. మిమ్మల్ని చూడగలిగిన ఉత్సాహం, మీ పేరు వినడంతో నీళ్ళు కారి పోయింది ఆ క్షణం నుంచీ ఆలోచిస్తున్నాను. ఏ పేరుతో పిలుస్తే ఈ బంగారు పూవుకి తావి అబ్బుతుందని."

ఈ సంభాషణ ఢక్కా నౌబత్తులు చెవులలో వాయిస్తున్నట్టు రింగుమంటున్నది మరి వినలేక వీధిలోకి వెళ్ళిపోయాడు తాను

తాను తిరిగి వచ్చేసరికి ఇంట్లో అన్నీ మామూలుగానే ఉన్నాయి వాడు వెళ్ళిపోయాడు పడకగది చాల శుభ్రంగా ఉంది

వీధి వరండాలో దోమలని సిలింగు ఫాను లేదని రాత్రిళ్ళు నిద్ర పట్టడమే లేదని తినేస్తుంటే వాడికి పడకగదిలో చోటిచ్చి వరండాలో

దయానిధికి బ్రిడ్జి మెట్లు సమీపించినట్లు కూడా అనిపించలేదు ఒక్కసారిగా శరీరం తూలిపోయి పడిపోతున్నప్పుడు తెలిసింది అది మెట్లని

వెనుక వెనుక వస్తున్న దర్మాత్ముడెవడో పట్టుకున్నాడు లేకపోతే దయానిధి ఈసరికి హాస్పిటల్‌లో ఉండేవాడే

సూర్యుడు బంతిలా ఆకాశం మీద ఎగురుతున్నాడు

ఒకటి ఒకటి మెట్లు దిగి మళ్ళా రోడ్డు పట్టాడు దయానిధి

రైల్వే హాస్పిటల్ దాటి నడుస్తున్నాడు క్రమంగా కాలువ దాటాడు కాలువలో నీరులేదు లాకులు కట్టేసి చాల కాలమయింది నిండుగా మరకతం వంటి నీళ్లతో నీలాల నీళ్ళతో పారుతుండే కాలువ మాడిపోయింది

కృష్ణ కాలువ పక్క నుండి పోతుంటే ఎవరో తెలిసిన వాళ్ళు పలకరించారు తన చెవులలో ఏదో పిలుపు– వాళ్ళందరూ తనని అడుగుతున్నారు ఎండలో ఎక్కడికని కాలికి కట్టేందుకనీ పంచ చిరిగిందేమని తాను దయానిధి కానట్టు ముందుకు నడిచాడు

దారిలో వంతెన ఎదురయింది అది దాటి తిన్నగా పోతే ఏలూరు రోడ్డు ఎదురయింది ఈ పెద్ద రోడ్డు నిండా మనుష్యులు రిక్షాలు కారులు బస్సులు ఏమీ ఆలోచించకుండా దీనిమీద నడవాలి– ఆలోచనలతో నడిస్తే ఏ బస్సు క్రిందో కారు క్రిందనో పడడం తప్పదు

కాళ్ళు చురుకుతున్నవి రోడ్డు మీద నున్న తారు మెత్తబడుతున్నది ఆకాశం మీదికి సూర్యుడు ఎగబ్రాకుతున్నాడు ఎండలో వేడి ఉందో వెల్తురు ఉందో అన్నీ ఉన్నవో–

అన్నీ ఉన్న గుణాభిరాముడు వాడు వాడి సంగతి తనకు బాగా తెలుసు రోజూ బజారుకు మోసుకుపోయే ఆ తోలుసంచి నుండి తన కొకటానిక్ – తన భార్యకో ఫాస్ఫాల్స్ ఉన్న సీసా ఇచ్చాడు తను బాగా నీరసంగా ఉన్నాడని తన భార్య అందం ఇంకా పెరుగుతుందని వాడు అన్నాడు

ఆ తోలు బాగులో ఇంకా ఏమేమి ఉందో చూపించాడు వాడికి చెప్పుకోడానికి సిగ్గు కూడా ఉండదు కొంతమంది స్నేహితులు అనుకోకుండా కలిస్తే పనికి వస్తుందట ఆ మందు సీసా

తనకి వాడికి ఏమంత స్నేహం లేదు వాడి పద్ధతే వేరు హైస్కూలులో చదువు కున్న రోజులలోనే

మొరాకోలో జరిగిన ప్రపంచ కవిసమ్మేళనంలో వరల్డ్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చర్ వారి అవార్డు పొందిన ప్రముఖతెలుగు కవి డా॥జె. బాపురెడ్డి గారిని ఇటీవల గుంటూరులోని సాహితీ సాంస్కృతిక సంస్థ 'చేతన' సన్మానించింది. ఆ సందర్భంగా డా. జె. బాపురెడ్డి గారిని సత్కరిస్తున్న ఆం.ప్ర. అధికార భాషా సంఘం అధ్యక్షుడు డా. సి. నారాయణరెడ్డి, సంస్థ అధ్యక్షుడు శ్రీ ఎ. విజయభాస్కర్ రెడ్డి గార్లని చిత్రంలో చూడవచ్చు.

చొక్కా కాలరు మీదకు లాక్కొని, చేతులు మడచి ఆడ పిల్లలను అల్లరి పెట్టేవాడు. తిన్ననయిన మనిషికాదు.

అటువంటి వాడి వలలో తనేలా పడిపోయాడు?....

ఆ ఎండ మండిపోతున్నది. తొందరగా నడవాలంటే మనుష్యులు. వాళ్లందరూ తనను చూస్తున్నారు. తన వేషం చూసి నవ్వుకుంటున్నారు.

... ఆ రోజు సాయంకాలం నాలుగు గంటలకు ఎవరో వస్తున్నారంటే తాను స్టేషనుకువెళ్లాడు. రావలసిన అతడు రాలేదు. వీడు తారస పడ్డాడు. వాడే ముందు పలకరించాడు. పెళ్లయిందంటే ఎప్పు డన్నాడు. పార్టీ అడిగాడు. పార్టీ లేకపోతే పోయె, కనీసం రాత్రి భోజనానికేనా ఫలవమన్నాడు. సాయం కాలం అయిదు గంటలకు తన వెనుకే వాడు కూడా ఇంటి దగ్గర హాజరయ్యాడు. రాత్రికి భోజనం చేసి, వరండాలో పక్క వేయించుకున్నాడు. తన అవస రాలు చాల తక్కువ అని, పొద్దున్నే పోతే రాత్రే వస్తానని ఇంట్లో తెప్ప వేశాడు....

క్రమంగా రోడ్డు మీద ఉన్న జనం పలచ బడు తున్నారు.

దయానిధి ఒక్క క్షణం ఆగాడు. పక్కనే వెదురు చాపలతో కట్టిన చిన్న గది. ఎవరో ధర్మాత్ములు దారిపోయేవారికి కుండలలో మంచి నీరు పంచు తున్నారు. అక్కడనున్న కుర్రాడు చేతులు కడుక్కో డానికి కొంచెం నీళ్లు పోసి, తరువాత దోసిలిలోకి చల్లని నీరు పోశాడు. రెండు చెంబులు నీళ్లుతాగి, మూతి చేతితో తుడుచుకొని దయానిధి తిరిగి నడక మొదలు పెట్టాడు.

రోడ్డు మీద తారు మిల మిలా మెరుస్తున్నది. సూర్యుడు నడి నెత్తికి వచ్చాడు.

దయానిధి రోడ్డు పక్క నుంచి నడుస్తున్నాడు. నీళ్లు తాగిన తరువాత చెమటలు హెచ్చయ్యాయి. గాలి వీచడం మానేసింది. ఎండ ఇంకా ముదిరి పోయింది. వెలుతురు బలిసింది. కళ్లకి అన్నీ చెదురు మదురుగా కనిపిస్తున్నవి. నుదుటి మీద నుండి కారుతున్న చెమట కను రెప్పల మీద పడి, కళ్లల్లోకి జారి మంట పెడుతున్నది. కాలికి తగిలిన దెబ్బ ఉండుండి సలుపుతున్నది.

దారి పక్కను పెద్ద మర్రి చెట్టు- దాని కొమ్మలు చాచుకొన్నాయి. ఆ నీడనిచ్చే చెట్టు తల్లివలె తనను ఒడిలోకి తీసుకుంది. ఆ సుఖం ఎంతోసేపోలేదు.

....వాడు జోక్ వేస్తున్నాడు.

"నువ్వు యంగ్ లేడీనా? ఓల్డు మెయిడ్వా? ఓల్డు మాన్ని కట్టుకున్న యంగ్ వుమన్వా? లేక యంగ్ మాన్ని కట్టుకున్న ఓల్డు లేడీవా? ఇప్పటి నుంచీ అంత మడీ, ఆచారం అయితే ఎట్లా?"

"మీ మాటలు చాల వింతగా ఉంటాయి. ముసలి మగాళ్లు పడుచు ఆడవాళ్లను కట్టుకోడం విన్నాను. మూడోపెళ్లి, నాలుగో పెళ్లి చేసుకున్న మగాళ్లు న్నారు. ఎక్కడా అమ్మమ్మలు పడుచుకుర్రాళ్లను పెళ్లి చేసుకున్నట్లు వినలేదు."

ఎండ

"ఓ యంగ్ లేడీ! అమెరికాలోని అమ్మమ్మలు అయిదో పెళ్లి చేసుకుంటారు. పడుచువాళ్లను ఎంచెంచి ప్రేమిస్తారు."

ఆమె నవ్వింది. చెరువులోని చిరుతరగలు కదిలి నట్లు, పూలగుత్తి గాలిలో ఊగినట్లు అని పించింది. ఆ నవ్వు ఎంతో అమాయికంగా ఉంది. నవ్వు ఆరోగ్యవంతుల లక్షణం.

వాడూ నవ్వాడు. వాడు వేసిన జోక్కి వాడు తప్పకుండా నవ్వుతాడు. కాని, ఎదుటివాడు నవ్విన తరువాతే నవ్వుతాడు. ఆ నవ్వు కృతకంగా ఉంటుంది. ఏ నక్కో, తోడేలో, సివంగో... అటువంటిదేదో జంతువు.... అది నవ్వుతుంది. చంపబోయే మేక పిల్లలను చూచి నవ్వుతుంది. దానిపై పెదవి మీదకి లేస్తుంది. పళ్లు కనిపిస్తుంటాయి. మేక పిల్ల హడలి చచ్చేటట్లు అది నవ్వుతుంది. ఆ దుమ్మలగుండు నవ్వు వాడిది....

గాలిలో కొంచెం చలనం కలిగింది.

ఆ మర్రిచెట్టు నీడలో ఉండడానికా తాను ఇంత దూరం వచ్చినది?

ఎక్కడికీ ప్రయాణం-

వాడెవడో- వాడి మీద కోపంతో

ఒళ్లు మండిపోతున్నది. హృదయం దహించుకు పోతున్నది. వాడి గురించి తలచుకుంటే అన్నీ మంటలే.

రోడ్డు పక్కను, చెట్టు వెనుక ఒక కాలి దారి కనిపిస్తున్నది ఆ దారి వెంబడి వెళ్తుంటే పొలాలు, ఆ పొలాలు ఎండిపోయి, భూమి బీటలువారి... చూడరాని వాని శరీరం వలె ఉంది.

దయానిధి నడుస్తున్నాడు పొలం గట్ల మీద.

.... నడవలో, మరొకడి పెళ్లాని నిలబెట్టి నిర్ల జ్జగా ప్రశ్నలువేస్తున్నాడు- ఆమె కళ్లల్లోకి సంకో తాలు పంపుతున్నాడు. స్నేహితుడి సంసారాన్ని విచ్ఛిన్నం చేయడానికి కొంచెమైనా జంక కుండా ఉన్నాడు.

వాడిని ఏం చేయాలి?

మందులు మాకులు ఇచ్చి ఆడదానిని వశపరచు కుంటున్నాడు.

వాడినేం చేయాలి??

మరొకడి భార్య పేరు భాగులేదని కొత్త పేరు వెతికే వంచకుడువాడు.

వాడినేం చేయాలి???

పాశ్చాత్య దేశాలలో తనకుమల్లే దగా పడ్డవాడు ద్రోహితో ద్వంద్వ యుద్ధం చేస్తాడు. కత్తి, బల్లెం, పిస్తోలు, ఏదో ఒకటి ఉపయోగిస్తారు. ఎదురెదు రుగా వచ్చి పోట్లాడుతారు.

గెలిచిన వాడితో ఆ స్త్రీ కులుకుతుంది.

ఈ యుద్ధంలో తానే చచ్చిపోతున్నాడు.

"మీరిద్దరూ హాయిగా ఉండండి!"

దయానిధి తూలిపోతున్నాడు. ఆ పొలాల గట్లు వెడల్పు లేవు. ఆ గట్ల పక్కను ఒక్కొక్క చోట గుంటలు, ఆ గుంటలు ఎండిపోయాయి. గట్ల మీద దారి వంపు తిరిగింది. కొంత దూరం పోతే దారి పక్కనో బురద గుంట. అందులో ఇంకా తేమ కనిపిస్తున్నది.

దయానిధి కాలికి రాయి తగిలింది. అతను తూలిపోతున్నాడు. గాలికి పిడికిళ్లు పడుతున్నాడు. ఆ బురదగుంటలోకి దిగిపోయాడు.

ఆ బురద లావావలె ఉంది.

లోపలికి దయానిధిని లాక్కుంటున్నది.

ఆ ఊబి అతనిని మింగుతున్నది.

* *

సుమతికి హఠాత్తుగా తెలివి వచ్చింది.

ఆమె నేల మీద పడుకుంది కాబట్టి సరిపోయింది. మంచం మీద పడుక్కొని ఉన్నట్లయితే దొర్లి క్రిందకు పడిపోయేది. ఆమె మెడలోని మంగళ సూత్రం పైకి తీసి కళ్ల కద్దుకొంది. ఎంత ఆపుకుందా మన్నా ఆమెకు దుఃఖం ఆగలేదు.

పగలు భోజనం లేదు. నోరెండిపోతుంటే మంచి నీళ్లు తాగుతున్నది. ప్రొద్దున్న భర్తకోసం ప్లేటులో పెట్టిన ఉప్మా, తాను తిందామని గిన్నెలో ఉంచినది అలాగే ఉంది.

ఆ ఉప్మానిండా జీడి పలుకులు, చేతికంటు కున్నట్లు వెన్న కాచిన నేయి ఆ వచ్చినస్నేహితు డెవరో చాలా చాలా బాగుందని మారు వేయించు కున్నాడు. అతను చెప్పిన పద్ధతికన్న చాల బాగా చేయగలనని నిరూపించింది తాను.

కాని, ఆయన రుచి కూడా చూడలేదు. ఎవడో మెచ్చుకుంటేనేం, లేకపోతేనేం.

ఏమీ అర్థం కాకుండా ఉంది.

ఇంట్లో ఎవరున్నారని? తనూ, ఆయన... ఈ మధ్యను అతని స్నేహితుడు. ఆ స్నేహితుడు వచ్చిన తరువాతే ఇబ్బందులు మొదలయ్యాయి.

ఇద్దరూ అయిదో తరగతి నుండి ఇంటరు వరకూ కలిసి చదువుకున్నారట! ఆయనకీ, ఆ స్నేహితుడికీ ఎంత భేదం? ఆయన ఎంత నిరాడంబరమైనవారో, ఆ స్నేహితుడంత డాంబికుడు. ఆయన మిత భాషి. ఈ స్నేహితుడు అవసరమున్నా లేకపోయినా తన ప్రజ్ఞ తెలుపుకోవాలని తెగవాగుతాడు. వీళ్లిద్దరిలో ఎవరు గొప్ప? గొప్ప వాళ్లు తాము సామాన్యులమంటారు- ఈ సామాన్యుడు చాల గొప్ప వాడినంటాడు. ఛీ...

నిన్నను ఉదయం ఎనిమిది గంటల వేళ, ఆ స్నేహితుడు అప్పుడే లేచాడు. తాను వంటింట్లోంచి వస్తున్నది. దారికడ్డంగా ఆ పెద్ద మనిషి నిలు చున్నాడు. పొద్దున్నే ఏదో అసందర్భ ప్రలాపన. తన పేరు చాల పాతదట. సినిమా తారల పేర్లో, అంతకన్న మంచివో ఆ మహాశయుడు తనకు పెట్టాలని ఆలోచిస్తున్నాడట! దారికడ్డం లెమ్మని కసిరేదాకా కదలలేదు.

తను కాఫీ పట్టుకొని గదిలోకి వెళ్తే ఆయన లేరు. ఎక్కడికో వెళ్ళిపోయారు. ఎందుకని?

ఏమీ అర్థం కాకుండా ఉంది.

ఆ రోజు సాయంకాలం ఎవరికోసమో స్టేషనుకి వెళ్ళిన ఆయన ఈ స్నేహితుడిని వెంటబెట్టుకొని వచ్చారు.

ఈ పెద్ద మనిషి అంత ఎంతా కాలంలోను సూటుతోనే ఉన్నాడు. ఒక చేతిలో సూట్‌కేసు, రెండవ చేతిలో మందుల బాగు. అతని కాళ్ళకున్న బూట్లు మెరుస్తున్నాయి

*   *   *

వాళ్ళిద్దరూ పడకగదిలో కూర్చున్నారు.

ఆయన నన్ను పిలిచారు.

"వీడు మా స్నేహితుడు. మురళీకృష్ణ. ఇద్దరం కలిసి చదువుకున్నాము. ప్రస్తుతం మందుల ఏజెంటుగా పని చేస్తున్నాడు. రాత్రి మన యింటికి భోజనానికని పిలిచాను- కృష్ణా! ఈమె నాభార్య. సుమతి."

ఆ విధంగా ఈ పెద్ద మనిషి పరిచయమయాడు.

రాత్రి సుష్టుగా భోజనం చేశాడు. వరండాలో పక్క వేయించుకున్నాడు. ఏమీ మొహమాటం లేని మనిషి. మరునాడు ఉదయం టిఫిన్ తిని, కాఫీ తాగి వెళ్ల వలసిన మనిషి మధ్యాహ్నం భోజనానికి వస్తానన్నాడు. ఆయన ఏమీ మాట్లాడలేదు.

ఆ పరిస్థితులలో నేనేం చేయాలి?

ఆ స్నేహితుడెంత అప్పుడో.

క్రమంగా అతను చొరవ తీసుకున్నాడు. పడగ్గది ఆక్రమించి దంపతులని వరండాలోకి పంపించాడు. ఇంటి విషయాలలో కలిగించుకున్నాడు. ఆయనను చులకన చేసి మాట్లాడాడు. తనతో స్నేహం పెంచుకోడానికి తాపత్రయ పడుతున్నాడు.

ఈ విషయాలన్నీ పక్కింటి పిన్నిగారికి తాను మధ్యాహ్నం చెప్పింది.

ఆవిడ ముక్కు మీద వేలు వేసుకున్నారు.

ఆయన ఇల్లు విడిచి వెళ్ళిపోయారని, మధ్యాహ్నం భోజనానికి ఈ పెద్ద మనిషి వస్తాడని, పిన్నిగారిని సహాయంగా ఉండమని తాను మరీ మరీ కోరింది.

పిన్నిగారిని చూడగానే అతను ముఖం ముడుచుకున్నాడు.

ఏదో అనవసర విషయమై లెక్చరు మొదలు పెడితే తాను అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

ఇంటి యజమాని, తన స్నేహితుడు ఏమయాడని కాని, ఎప్పుడు వస్తాడని కాని అడగలేదు.

"నీకు ఇచ్చిన మందు వాడుతున్నావా? ఒక నెలలో ఎంత మార్పు వస్తుందో చూడు. ఎంత అందంగా తయారవుతావో. నీవంటిదానిని ఈ రామేశ్వరపు రాచిప్పగాడికి కట్టబెట్టారు. నేను చాల ఫీలవుతున్నాను."

తాను ఆ మాటలు విన్నా జవాబు చెప్పలేదు.

ఆ పెద్ద మనిషి మధ్యాహ్నం వెళ్ళిపోయిన తరువాత పిన్నిగారు అన్నారు.

"అమ్మాయ్! వీడెవడో?.. వీడి వ్యవహారం బాగులేదు. నువ్వు కొత్తగా కాపురానికి వచ్చావు. నీ మొగుడు చాల మంచివాడు. ఆరు నెలలయి మా పొరుగున ఒంటరిగా ఉన్నా, ఏ ఆడదానిని కన్నెత్తి చూచిన పాపాన పోలేదు. మా కుర్రాడు మీ ఆయన శిష్యుడు. మాస్టరుగారంటే వీడికి ఎంత గౌరవమో తెలుసా?"

సమతికి కళ్ళంట నీళ్ళు ధారలుగా కారుతున్నాయి.

ఆయన ఎక్కడికి వెళ్లారు?

ఆకలికి ఉండలేరు. ఏమవస్థ పడుతున్నారో?"

వండిన వంట అంతా పని మనిషి కిచ్చింది.

"అమ్మగారూ! వంట్లో బాగులేదా?"

తాను అవునని తల ఊపింది.

ఎండ చాల మొండిగా ఉంది. ఏం చేయడం?... ఏమీ తోచక నేల మీద కొంగు పరుచుకొని పడుక్కుంది. ఆకలి, ఆలసట, నిస్సహాయత్వం అన్నీ కలిసి తనను జోకొట్టాయి.

ఆ నిద్రలో ఏదో కల- వాడెవడో చాల అందమయినవాడు- కాని వాడి హృదయంలో విషం- చూపులలో హాలాహలం తనను సమీపించి మెడలోని మంగళసూత్రం తెంపడానికి...

ఆమెకు ఒళ్ళల్లా చెమట పట్టింది. శరీరం వొణుకుతున్నది.

"పిన్నిగారూ! చాలా భయంగా ఉందండీ! ఆయన ఇంకారాలేదు. ఏం చేయను పిన్నిగారూ?"

"అమ్మాయ్! మీ ఆయన దెబ్బ తగిలినా లక్ష్యం చేయకుండా నడుస్తున్నాడని రిక్షావాడు చెప్పాడు. పలకరించినా తొందరగా నడిచిపోయాడని స్నేహితులు చెప్పారు. ఇది అనుమాన రోగం. ఇవన్నీ దాని లక్షణాలే. మీ ఆయన వట్టి మేదకుడు. ఒకరి మనసును మాటలతోనేనా కష్టపెట్టలేడు. వచ్చిన పెద్ద మనిషి ఈ నిజం తెలుసుకున్నాడు. వలలు పన్నుతున్నాడు. నీ కాపురం నువ్వే నిలబెట్టుకోవాలి. ధైర్యంగా ఉండు. మీ ఆయన వస్తాడులే"

ఆపాటి ధైర్యమిచ్చారు పిన్నిగారు.

కాపురం నిలబడడానికి ఒక్కటే మార్గముంది.

సుమతి పెరటిలోకి వెళ్ళింది.

"ఓ భగవంతుడా! మా వారిని ఇంటికి రప్పించు తండ్రి!"

అప్పటికే సూర్యుడిని కబళించిన మేఘం ఆమెకు అభయమిచ్చింది.

*   *   *

పయోనిధి ఊబిలో పూర్తిగా కూరుకుపోలేదు. మొలవరకు అతని శరీరం దిగిన తరువాత చేతికి గట్టిగా భూమి తగిలింది. అందులోని బురద మీది భాగంలో చాల వేడిగా ఉన్నా పాదాల దగ్గిర వెచ్చగా ఉన్నట్లుంది. బైట పడడానికి అతను ప్రయత్నించాడు. కాని లాభం లేకపోయింది.

అతను ఆకాశం వేపు చూచాడు.

సూర్యుడిని కప్పడానికో మేఘం తరముకుంటూ వస్తున్నది. దూరాన ధూళి లేస్తున్నది. ఆ దుమారం తనను దాటి వెళ్ళిపోయింది. ఆ మేఘం ఆకాశాన్ని ఆక్రమించుకుంటున్నది. ఏదో గాలిలో ఛల్లదనం. దానితో రత్నాలవలె నేలకు రాలిన చినుకులు. తొలి చినుకులతో లేచిన ఆవిరులు, ఆవిరులు లేవక





ముందే మొదలయిన వర్షం. ఆ వర్షం నిలకడగా నిలిచి ధారాపాతంగా కురియడం మొదలు పెట్టింది. దయానిధికి దివ్యమైన అనుభూతి కలిగింది.

చెప్పరాని ఆనందం చిందులు వేసింది.

అతనిని మొలవరకు బంధించిన బురద చల్లబడింది. మెత్తబడింది. కరిగింది. అతని శరీరం దాని పట్టునుండి తప్పుకొంది. కొద్ది ప్రయత్నంతో అతను పైకి వచ్చాడు.

వర్షం కురుస్తుంటే అతను శరీరానికి పట్టిన మన్ను కడుక్కున్నాడు. ఇంకా కురుస్తూంటే చేతులు మరొకసారి శుభ్రం చేసుకొని దోసిలి పట్టాడు. దోసిలి నిండిన వర్షపు నీరు తాగాడు– మరొక దోసిలి– ఇంకొక దోసిలి.

మడిగట్లు జారుతున్నవి. పడుతూ లేస్తూ దయానిధి తనకు నీడనిచ్చిన మర్రి కిందికి వచ్చాడు.

అప్పుడు అతనికో సంగతి జ్ఞాపకం వచ్చింది.

ఒకసారి ఇలాగే సాయంకాలం వేళ వర్షం వచ్చింది. ఉన్నట్టుండి ఆకాశాన్ని దట్టమయిన మేఘాలు కప్పివేశాయి. స్కూలులో ఆఖరి గంట కొట్టారు. ఏనుగు తొండాలతో వర్షం కురుస్తూంటే పిల్లలు ఎవరూ క్లాసు విడిచి వెళ్లలేదు. వరుసగా రెండు పిడుగులు పడ్డాయి. వాటితో కరెంటు కూడా పోయింది. ఒకరి ముఖం ఒకరికి కనిపించని చీకటి.

"కాలక్షేపానికి మీకందరికీ..."

అంత వరకు అతను అన్నాడో లేదో అందరు కుర్రాళ్లు చప్పట్లు చరిచారు. వాళ్లకు ఎంతో సంతోషం. ఏదో కొత్త విషయాలు అతను చెప్తాడని వాళ్లకి తెలుసు.

"వినండి! ఒక వర్తకుడు తన భార్యని విడిచి పెట్టి పైదేశాలకు వ్యాపారం మీద వెళ్లిపోయాడు. ఏళ్లు గడిచిపోయాయి. అతను ఎన్నో మజిలీలు చేసి ఒకనాటి మధ్యాహ్నం భార్యను చూడాలన్న కోరికతో ఇల్లు చేరుకున్నాడు. మధ్యాహ్నవేళ ఇంటి తలుపులు కూడా వేసి లేవు. అతను ఆ తలుపులు మెల్లిగా తోశాడు. ఆ చప్పుడికి లోపలివాళ్లు ఎవరూ లేవలేదు. గదిలో ఒక పక్కని మంచం మీద అతని భార్య నిద్రపోతున్నది. ఆమె పక్కను మరొక పురుషుడు కూడా నిద్రిస్తున్నాడు. వాళ్లిద్దరినీ చూస్తుంటే ఆ వర్తకుడికి భరించరాని కోపం వచ్చింది. అతడు వెనుక, ముందు ఆలోచించలేదు. చూరులోనున్న కత్తిని ఒక్కసారి బైటకు లాగాడు. వాళ్లిద్దరినీ నరికి చంపాలని. ఆ కత్తితో పాటు ఒక తాటాకు కూడా కిందను పడింది. అదేదో ప్రేలేఖ అనుకొని వంగి దానిని భద్రంగా తీసి చదవడం మొదలుపెట్టాడు. అతనికి అప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఎవరో కవిగారు, భార్య వ్రతానికి డబ్బు లేక, ఈ శ్లోకం తన దగ్గర తాకట్టు పెట్టాడు. అందులో ఏముందో తెలుసా?"

తొందరపడి ఏపని చేయరాదు. అవివేకము ఆపదలకు మూలము. ఆలోచించి పని చేసేవారిని సంపదలు వెతుక్కుంటూ వస్తాయి.

కేన్సర్ చికిత్సలో హిప్నాటిజమ్!

మానసిక వ్యాధుల చికిత్సలో హిప్నాటిజమ్ చోటు చేసుకుంటున్నది. ఈ ప్రక్రియను ఆటో హిప్నాసిస్ అని అంటారు. ఈ విధానంలో సుషుప్తావస్థకు ప్రాధాన్యత లభిస్తుంది. ఈ స్థితిలో మనిషికి వైద్యునకు అడ్డుగా నిలిచే భయాలు, సందేహాలు తొలగి పోతాయి రోగి ఈ స్థితిలో తన మనస్సుని వైద్యునికి తెలియచేయటానికి వీలవు తుంది. మరో కరు సూచనలు చేసి రోగిని హిప్నటైజ్ చేయడం పట్ల ఏర్పడే అపోహలు ఆటో హిప్నాసిస్ వలన తొలగి పోతున్నాయి.

ఇటీవల పశ్చిమ జర్మనీలోని మ్యానిచ్ విశ్వ విద్యాలయంలో జరిగిన హిప్నాసిస్ – హిప్నో థెరపీ సమావేశాలకు ప్రపంచం నలు మూలల నుండి పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేన్సరు చికిత్సలో హిప్నాటిజమ్ పాత్ర గురించి పలువురు ఉపన్యసించారు. శస్త్ర చికిత్సల తరువాత రోగిలో ఏర్పడగల మానసిక దుష్పరిమాణాలని తొలగి రోగి జీవించగల అవకాశాలను మెరుగు పర్చడమే హిప్నోథెరపీ ప్రధానోద్దేశ్యం. ఈ రంగంలో టెక్సాస్ వైద్యులు గార్ల్‌సిమన్‌టన్ కృషి ప్రముఖంగా పెర్కొన దగినది. సిద్ధావ సూచనల ద్వారా రోగిలోని రక్షణ శక్తిని చైతన్య వంతం గావించడానికి ఆయన కృషి చేశారు.

ప్రస్తుతం కొన్ని దేశాలలో, దంతవైద్యం మొదలు కొని కేన్సర్ చికిత్స వరకు పలు రంగాలలో బాధా నివారిణిగా హిప్నోథెరపీని ఉపయోగిస్తున్నారు. అంతేగాక, మనిషి జీవించి నంతకాలం నిరాశావాదాన్ని, అలసటని తొలగించి అర్థవంతమైన జీవితాన్ని గడిపేందుకు వీలుగా దీనిని రూపొందిస్తున్నారు. ఈ వైద్య ప్రక్రియ మానవుని జీవిత విధానాన్ని నిస్సందేహంగా మెరుగు పరచగలదని భావిస్తున్నారు.

(గ్లోబల్)

ఎండ

ఆ పడుకున్నవాడు పదిహేను ఏళ్ల తన కొడుకే అని తెలుసుకున్నాడు. ఆ కవి ఎవరో తెలుసా?"

క్లాసులోనున్న పిల్లలు వింటున్నారు. చెవులప్పగించి వింటున్నారు వర్షం వెలిసిన సంగతి కాని, తిరిగి లైట్లు వచ్చాయని కాని వాళ్లు గుర్తించలేదు. ఎవరూ వెళ్లిపోడానికి తొందర పడడం లేదు.

వాళ్లందరూ ఆ కవి పేరు వినాలని, ఆ శ్లోకమేదో వ్రాసుకోవాలని కూర్చున్నారు.

"ఆ కవి భారవి- ఆ శ్లోకం- సహసా విదధీత నక్రియాం! అవివేకః పరమాపదాం పదమ్..."

దయానిధి మనస్సులో అమృత వృష్టి కురిసింది.

లోకాన్ని అపార్థం చేసుకోడం ఎంత సులువు.

దీపాలు వెలిగిన నగరం వేపు దయానిధి నడిచాడు.

* * *

సుమతి వీధి అరుగు మీద కూర్చుంది. వంట, పనులు పూర్తి చేసింది. తరువాత స్నానం చేసింది. దేవుడి దగ్గర దీపం పెట్టింది. ఆ మురళీ కృష్ణ బట్టలు, బాత్‌రూమ్ చెప్పులు సూట్‌కేసు గదిలోంచి తెచ్చి అరుగుమీద పెట్టింది. మరచిపోకుండా భర్త కిచ్చిన టానిక్, తన మందు సీసా తెచ్చింది.

మురళీకృష్ణ వచ్చేసరికి ఎనిమిదయింది.

ఆటో దిగాడు అతను. అతని చేతిలో లెదర్ బాగు ఉంది. రెండవ చేతిలో సన్నజాజి దండలు, స్వీట్సు ఉన్న పాకెట్టు స్పష్టంగా వీధి దీపం వెలుతురులో కనిపిస్తున్నవి.

"హలో డార్లింగ్" అతను ఒంటరిగా అరుగు మీద కూర్చున్న సుమతిని చూచి పలకరించాడు.

వీధి మెట్లు అతను ఎక్కడానికి కూడా ఆమె అవకాశం ఇవ్వలేదు.

"ఆగండి!" ఆమె ఉరిమింది.

పొరుగింటి పిన్నిగారు, పక్కింటి తాతగారు అరుగుల మీదికి వచ్చారు.

మురళీకృష్ణ నిలబడిపోయాడు.

"ఇంత వరకూ మీరు చేసిన అపకారం చాలు– మీరు, మీ మందులు మీ చాతుర్యం చాలు. మీరు నమ్మ దగిన స్నేహితులు కారు, కుటుంబాలను విచ్ఛేదం చేసే ఘనులు, ఈ యింట్లో అడుగు పెట్టె అవకాశం పోగొట్టుకున్నారు. ఇవన్నీ మీవి. తీసుకొని వెంటనే వెళ్లిపొండి!"

మురళీకృష్ణ నీరు విడిచిపోయాడు.

వెళ్లిపోతున్న ఆటోని పిలిచి సామాను తీసుకొని వెళ్లిపోయాడు.

సుమతి నీరసంగా పడక గదిలోకి నడిచి ఏడుస్తూ కూలబడింది.

ఇంటికి కొంచెం దూరంలో నిల్చబడి తతంగమంతా చూస్తున్న దయానిధి మెల్లిగా ఇంట్లోకి వచ్చాడు. వీధి తలుపులు వేశాడు. పడక గదిలోకి వెళ్లాడు.

"సుమతీ!"

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ కాళ్ల మీద పడింది. ఆమెను రెండు చేతులతోను లేవనెత్తాడు.

"స్నానానికి నీళ్లు తోడు! చాల ఆకలిగా ఉంది!"

ఆమె కళ్లు ఒత్తుకొని అతని వెనకనే స్నానాల గదివేపు నడిచింది. □